క్లుప్తంగా

వైఎస్సార్‌టీఎఫ్ ఎన్నికలు


సురేష్


వెంకటేశ్వర్లు

కావలి: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ కావలి మండల అధ్యక్షుడిగా వై.సురేష్, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయులతో సన్నిహితంగా వ్యవహరించే సురేష్, వెంకటేశ్వర్లుకు వైఎస్సార్‌టీఎఫ్ కమిటీలో సముచిత స్థానం కల్పించడంపై యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుదర్శనం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయ ఆవరణలో అభయాంజనే స్వామి ఆలయ నిర్మాణానికి మంగళవారం గ్రామస్తులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధాన, వాస్తుహోమాలు నిర్వహించారు. ఈ భూమి పూజలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో చైతన్య జానపద కళాకారుల బృందం మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. గండిపాళెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజరు కె.శోభన్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, సురక్ష బీమా యోజన, ఏపీవై పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్య, వ్యాపార, గృహ, పాడుపు రుణాలను తక్కువ వడ్డీకే బ్యాంకులు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు పంట రుణాలు రెన్యువల్ చేసుకుని ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసరు ఇంతియాజ్, సిబ్బంది జ్యోతి, చినఖాసిం పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



మర్రిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని డీసీపల్లి టోల్‌గేట్ వద్ద ఎస్సై మంగళవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకుల వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడుపుతున్నారా? అని పరిశీలిస్తున్నామన్నారు. వాహనచోదకులు అవసరమైన కాగితాలను ఎప్పుడూ తమ వెంటే ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాదరులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు.

పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


రామస్వామిపల్లిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: నాలుగున్నరేళ్లుగా కులమతాలకు, పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా అందజేస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామస్వామిపల్లి, బంట్లపల్లి గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. అనంతరం గిరిజనకాలనీ, బంట్లపల్లి గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామస్వామిపల్లి సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం రూ.11.31 కోట్లు ఖర్చు చేసిందన్నారు. నవంబరు 2న ఆత్మకూరు ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళా ద్వారా 2 వేల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. రామస్వామిపల్లి, బంట్లపల్లి గ్రామాల్లో ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రామస్వామిపల్లి నుంచి బంట్లపల్లి మీదుగా డీసీపల్లి వరకు రోడ్డు ధ్వంసమై పోయిందని, తక్షణం ఈ రోడ్డు పునః నిర్మించాలని కోరారు. త్వరలోనే నూతన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ సంపతి రమణమ్మ, మాజీ సర్పంచ్ గుంటక శ్రీరాములురెడ్డి, బోయలచిరివెళ్ల, ఆరవేడు, రామానాయుడుపల్లి, నందవరం సర్పంచ్‌లు బొలిగర్ల వెంకటేశ్వర్లు, సూరం ప్రసాద్‌రెడ్డి, గాలిబోయిన రామ్మోహన్, వెంకటేశ్వర్లునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోనంకి శ్రీనివాసులునాయుడు, కొప్పోలు యల్లారెడ్డి, గడ్డం శ్రీనివాసులు రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గృహ సారథులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రభుత్వం


మాట్లాడుతున్న మండల కన్వీనరు బాలగురవారెడ్డి

వరికుంటపాడు: గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని పథకాలతో ఆర్థిక భరోసా కల్పించి, పేదల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆంద్రా బాలగురవారెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త, నేతలు ప్రజలకు మన ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాలు వివరించి మళ్లీ సీఎంగా జగన్‌ను చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఏపీకి జగన్ ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమంపై వరికుంటపాడులో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. బాలగురవారెడ్డి మాట్లాడుతూ నవంబరు 1 నుంచి గ్రామాలలో ఏపీకిజగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం ద్వారా టీడీపీ పాలన, ప్రస్తుత పాలన మధ్య తేడాను ప్రజలకు వివరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు పెద్దపీట వేసి సీఎం జగన్ మోహన్‌రెడ్డి సామాజిక విప్లవం సృష్టించారన్నారు. పేదల కుటుంబాలలో సంక్షేమ వెలుగులు నిండాలన్నా, ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, అభివృద్ధి పరుగులు తీయాలన్నా మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే కావాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సంక్షేమ పథకాలతో కూడిన శిలాఫలకాలు ఆవిష్కరించి వైఎస్సార్‌సీపీ జెండాలు ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బోగినేని శ్రీనివాసులునాయుడు, మాజీ మండల కన్వీనరు గంగవరపు పుల్లయ్యనాయుడు, మండల బూత్ కన్వీనరు మానం మస్తానయ్య, మండల ఎస్సీ నేతలు కాకి అంకయ్య, తాతపూడి డేవిడ్, నాయకులు గుంటుపల్లి నాగభూషణం, పాలకొల్లు విజయభాస్కర్‌రెడ్డి, మూలె వీరారెడ్డి, ఎం.నాగిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, కాలే వెంకటేశ్వర్లు, బోగ్యం విజయకుమార్, వై.రవి, గుర్రం భాస్కర్‌రెడ్డి, బొమ్ము వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మీనరసయ్య, లక్ష్మీరెడ్డి, నారాయణ, బిజ్జం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


జాఫర్ సాహెబ్ కుటుంబీకులకు ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో నిత్యాన్నదాత శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి మున్సిపల్ పరిధిలో మృతి చెందిన పేద కుటుంబాలకు అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తొలి రోజే మంగళవారం ఇద్దరికి ఆర్థిక సాయాన్ని అందించారు. పట్టణంలోని 13వ వార్డులో మృతి చెందిన గడ్డం హరికృష్ణ, 7వ వార్డుకు చెందిన జాఫర్ సాహెబ్ మృతి చెందడంతో వారి కుటుంబీకులకు ట్రస్ట్ తరపున రూ.10వేలు చొప్పున పరమేశ్వరరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో కుడుముల సుధాకర్ రెడ్డి, జి బుజ్జిరెడ్డి, రాంపల్లి ప్రసాద్, యానాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాదర్తికి ఘన సత్కారం


పాదర్తి నాగరాజును సత్కరిస్తున్న దృశ్యం

కావలి: కావలిలో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న పాదర్తి నాగరాజును హైదరాబాద్ చెందిన 'హోప్ దియోలోజికల్ యూనివర్సిటీ ఆఫ్ యు ఎస్ ఏ' సంస్థ డాక్టరేట్ అవార్డ్ ప్రదానం చేయడంతో వాసవీ వనిత క్లబ్ లెజెండ్స్ మహిళలు ఘనంగా సన్మానించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగరాజును శాలువాలతో సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు అనుమాలశెట్టి కామాక్షి మాట్లాడుతూ నాగరాజు సమాజంపై బాధ్యతతో ఆపన్నులను ఆదుకుంటూ, పలు రకాలుగా సేవలు చేసినందుకు ఈ అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్ కార్యదర్శి ఇన్నమూరి హేమలత, పెండ్యాల జ్వాలకుమారి, దుగ్గిశెట్టి హేమలత, అమర కామాక్షి, బొగ్గవరపు శ్రీలక్ష్మి, మట్టా పార్వతీ, పానుగంటి సులోచన తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలు చోరీ

చేజర్ల: విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లోని రాగి తీగలు చోరీకి గురైన ఘటన మండలంలోని వావిలేరు సమీపంలో నావూరు కాలువ వద్ద సోమవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు నావూరు కాలువ వద్ద వ్యవసాయ పొలాల కనెక్షన్ కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని విలువైన రాగి తీగను అపహరించారు. మంగళవారం విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంబేడ్కర్ ఇండియన్ మిషన్ సమావేశం

కావలి: కావలి డివిజన్ అంబేడ్కర్ ఇండియన్ మిషన్ సమావేశం ఆ సంఘం జిల్లా కో–కన్వీనర్ కట్టెపల్లి సింహాద్రిరావు అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగింది. జిల్లా కన్వీనర్ పట్టెడ మురళి మాట్లాడతూ 'మన వాడ మన పంచాయతీ మన పాలన' అనే ఆశయ సాధనతో అంబేడ్కర్ ఇండియా మిషన్ పనిచేస్తుందన్నారు. దళితులందరూ ఏకం కావాలని కోరారు. కార్యక్రమంలో కావలి డివిజన్ నూతన కన్వీనర్‌గా బత్తల రవిచంద్రను నియమిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ యాక్షన్ కమిటీ మెంబరు టి.కృష్ణ, ఉక్కాల శ్రీనివాసులు, జూగుంట కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచముఖశక్తి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి శ్రీపంచముఖశక్తి గణపతి దేవస్థానంలో విజయదశమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పాశర్లపూడి సుదర్శనశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలేరమ్మకు పూలంగి సేవ



సోమశిల: మండలంలోని పాతదేవరాయపల్లిలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో మంగళవారం పుష్ప అలంకరణ చేశారు. పుష్పాలంకరణలో ఉన్న అమ్మ వారిని మహిళా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శరవేగంగా రామాలయం నిర్మాణ పనులు

- కొన్నేళ్లుగా ఆగిన ఆలయ నిర్మాణం
- శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షల మంజూరు
- మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కృషి ఫలితం


చుంచులూరులో నిర్మాణంలో ఉన్న రామాలయం

మర్రిపాడు: ఏళ్ల తరబడి పెండింగ్ సమస్యలకు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధికి 'ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం' ఏర్పాటు చేసి ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తుండడంతో పాటు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. తాజాగా నియోజవర్గంలో అనేక దేవాలయాల జీర్ణోద్ధరణ, కొత్తగా ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చేట్టారు. ఇందు కోసం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.5.80 కోట్లు మంజూరు చేయించారు. ఇందులో మండంలోని చుంచులూరు ఎస్సీ కాలనీలో ఏళ్ల తరబడి మధ్యంతరంగా నిలిచిపోయిన కోదండ రాముడి దేవాలయానికి కూడా రూ.10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. కాలనీవాసుల సమన్వయ లోపంతో కొన్ని సంవత్సరాలుగా ఎస్సీ కాలనీలోని కోదండరాముడి దేవాలయం నిర్మాణం ప్రారంభమై ఆగిపోయింది. సర్పంచ్ చీలపోగు చామంచయ్య, ఆయన కుమారుడు వెంకట ప్రసాద్ కాలనీ వాసులను సమన్వయపరచి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మేకపాటి నిధులు మంజూరు చేయించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాల నిర్మాణాలకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డిలకు జీవితాంతం రుణపడి ఉంటామని కాలనీవాసులు తెలిపారు. మండలంలోని చిలకపాడు, పోలిరెడ్డిపల్లి, ఏపిలగుంట గ్రామాల్లో నూతన ఆలయాలకు నిధులు, చుంచులూరు, రామానాయుడుపల్లి, కదిరినాయుడుపల్లి గ్రామాల్లో ఆలయాల జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేశారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- గ్రాప్లింగ్, రెజ్లింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం


జాతీయ స్థాయిల్లో విజయం సాధించిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు: చదువుతో పాటు విద్యార్థుల క్రీడలపై ఆసక్తి పెంచుకుని శిక్షణ పొందాలని, తద్వారా శారీరక ఎదుగుదలతో పాటు మానసిక పరిపక్వత అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు అన్నారు. ఆత్మకూరులోని జేఆర్‌పేటలో రెజ్లింగ్ (కుస్తీ) కోచ్ రాంబాబు ఆధ్వర్యంలో గ్రాప్లింగ్, రెజ్లింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆయన వద్ద శిక్షణ పొందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో రెజ్లింగ్‌లో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా కోచ్ రాంబాబు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని, ఆత్మకూరులో ఇలాంటి శిక్షణ కేంద్రం నిర్వహించడం మంచి పరిణామమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాల సొసైటీల ఆదాయం సభ్యులకే

- విజయ డెయిరీ ఎండీ కృష్ణమోహన్


పాడి రైతులకు బహుమతులు అందజేస్తున్న పాల సొసైటీ నిర్వాహకులు

సంగం: పాల సొసైటీలకు వచ్చే ఆదాయం సభ్యులకే ఇవ్వడం జరుగుతుందని విజయ డెయిరీ ఎండీ కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని సన్నారెడ్డి పాళెంలోని విజయ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘంలో అధ్యక్షుడు డేగా వెంకయ్య అధ్యక్షతన పాడి రైతులకు విజయదశమిని పురస్కరించుకుని బహుమతులను అందజేశారు. ఎండీ మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంఘం 20 ఏళ్ల నుంచి సొసైటీకి వచ్చిన ఆదాయాన్ని సభ్యులకే అన్ని రకాలుగా పంపిణీ చేస్తోందని వివరించారు. ఉదయం 150 లీటర్లు, సాయంత్రం 130 లీటర్లు డెయిరీకి సరఫరా చేస్తున్నారన్నారు. కరోనా సమయంలో, ఆ తర్వాత విజయ డెయిరీ 3 ఏళ్లుగా కొంత నష్టాలు చవిచూసినా ప్రస్తుత సంవత్సరం ఆదాయంలో నడుస్తుందన్నారు. ఈ సందర్భంగా 40 మంది రైతులకు బహుమతులను అందజేశారు. 60 మంది వినియోగదారులకు కూడా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ జీ శివయ్య, పొన్నలూరు శివకుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ పీ సుబ్రహ్మణ్యం, సెక్రటరీ సుభాన్‌బాయి, పాడి రైతులు పాల్గొన్నారు.

రామాలయంలో పార్వేట ఉత్సవం



సోమశిల: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మండలంలోని వరికుంటపాడు రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం పార్వేట కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, గ్రామ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిప్రపత్తులతో శరన్నవరాత్రి వేడుకలు


ఆత్మకూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నిర్వాహకులు


ఆత్మకూరు: జ్వాలాముఖి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకారం

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సోమవారం రాత్రి మహిషాసురమర్దిని అలంకరణలో కన్యకాపరమేశ్వరి, జ్వాలాముఖి అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చారు. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయం, కాశీనాయన ఆశ్రమంలోని దుర్గాలయం, సుందరమ్మ కోదండ రామాలయంలో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ఏర్పాటు చేసిన కలశాలకు ప్రత్యేక పూజలు చేసి దీక్షలు విరమింపజేశారు.

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు

పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, జ్వాలాముఖి ఆలయాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల అర్చకులు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

వేడుకగా విజయదశమి

శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు విజయదశమిని మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరి, కన్యకాపరమేశ్వరి అలంకారాల్లో భక్తులను అనుగ్రహించారు. కన్యకాపరమేశ్వరికి పూలరథంలో గ్రామోత్సవం నిర్వహించారు.

వాడవాడలా విజయదశమి పూజలు

ఆత్మకూరురూరల్: మండలంలో గ్రామ దేవతల ఆలయాల్లో దుర్గాష్టమి, విజయ దశమిలను పురస్కరించుకుని సోమ, మంగళవారాల్లో విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. మండలంలోని మహిమలూరులో పోలేరమ్మ దేవాలయం వద్ద భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన బుట్టల్లో పొంగళ్ల సామగ్రిని మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. పమిడిపాడులో నూకాలమ్మ దేవాలయం, నల్లపరెడ్డిపల్లిలో పోలేరమ్మ, బట్టేపాడు దివ్యమాంబ, గండ్లవేడులో పోలేరమ్మ ఆలయాల వద్ద వాహన, ఆయుధ పూజలు జరిగాయి.

మహిషాసురమర్దిని అవతారం

అల్లూరు: స్థానిక మహాలక్ష్మమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

మహాలక్ష్మీదేవికి పూజలు

అనుమసముద్రంపేట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కృష్ణ మందిరంలో ఉన్న కన్యకా పరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం యువ నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

బాలచౌడేశ్వరి ఆలయంలో...

ఏఎస్‌పేట బీసీకాలనీ బాలచౌడేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నిర్వహించిన కోలాటం భజనలు అందరిని ఆకట్టుకున్నాయి. తొగటవీర క్షత్రియ యువకులు అమ్మవారి ఎదుట కత్తులతో సంప్రదాయబద్ధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాజరాజేశ్వరిదేవిగా కామాక్షితాయి

సంగం: కామాక్షితాయి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవ రాత్రి వేడుకల్లో మంగళవారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా దశమి వేడుకలు

కలిగిరి: మండలంలోని అన్ని గ్రామాల్లో విజయదశమి వేడుకలను సోమ, మంగళవారాల్లో వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. తెల్లపాడులోని భద్రకాళి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

విజయదశమి వేడుకలు

ఉదయగిరి: నియోజకవర్గంలో సోమ, మంగళవారాల్లో విజయదశమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పార్వతీ పరమేశ్వరి ఆలయం, బాలాజీనగర్‌లో అమ్మవార్లు మహిషాసురమర్దిని, రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు.


దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

అల్లూరు: అల్లూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, భక్తవత్సలరెడ్డి, మోహన్‌రెడ్డి, చెంతాటి కరుణాకర్, మేడా శ్రీనివాసుల రెడ్డి, మేడా నిరంజన్‌రెడ్డి, బత్తల సుధా, షేక్ రసూల్, చెంతాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


రాజరాజేశ్వరిదేవిగా కామాక్షితాయి


విశేష అలంకరణలో మహాలక్ష్మమ్మ


మహిమలూరులో పోలేరమ్మ ఆలయానికి మేళతాళాల సందడితో వెళ్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో భద్రకాళి


రాజరాజేశ్వరిగా పార్వతీదేవి